బుధవారం 17-7-2024

# ముందడుగు

దినపత్రిక

సంపుటి: 1, సంచిక: 396, పేజీలు: 4 | ₹6

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | JAGITYAL | KHAMMAM | NALGONDA | MAHABOOBNAGAR | NIZAMABAD

EPAPER.MUNDADUGU.COM

మీ ప్రాంతంలో జరిగే ఏలాంటి సమస్య ఐనా ముందడుగు దృష్టికి తీసుకురండి.. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం. మీ ప్రాంతంలో మీరు ముందడుగు పౌర పాత్రికేయుడిగా పనిచెయొచ్చు.. మీ సమస్యలపై స్పందించండి..

Mundadugu whatsapp:
9491114616
email: mundadugu111@gmail.com

## శంకరన్, శ్రీధరన్‌లా కలెక్టర్లు

# పనితీరు ఉండాలి

- ఆరు గ్యారంటీలు పారదర్శకంగా అమలు చేయాలి
- పారదర్శక ప్రజాహిత పాలనే ప్రభుత్వ లక్ష్యం
- కలెక్టర్ల సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి



ముందడుగు తెలంగాణ:
తెలంగాణలో పనిచేస్తున్న ఇతర రాష్ట్రాలకు చెందిన ఐఏఎస్ అధికారులు తెలంగాణ సంస్కృతిలో భాగస్వామ్యమై ప్రజలకు సరైన సేవలు అందించాలని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఆరు గ్యారంటీలను పారదర్శకంగా అమలు చేసే బాధ్యత కలెక్టర్లేదనని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, పోలీసు కమిషనర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వానికి కళ్లు, చెవులు కలెక్టర్లేనని సీఎం వ్యాఖ్యానించారు. జిల్లా స్థాయిలో అధికారుల నిర్ణయాలు ప్రజలకు ప్రయోజనం కలిగేలా, మానవీయ కోణంలో ఉండాలని చెప్పారు. ఒక శంకరన్, శ్రీధరన్‌లా సామాన్య ప్రజలు ఎప్పుడూ గుర్తు పెట్టుకునేలా పనిచేయాలన్నారు. పారదర్శక ప్రజాహిత పాలన అందించాలని, సంక్షేమం,

మిగతా 2లో




## వలస కార్మికులకు రేషన్ కార్డులు ఇవ్వలేదా

- ఇది చాలా దురదృష్టకరమైన విషయం
- రాష్ట్రాలపై సుప్రీంకోర్టు అసంతృప్తి

ముందడుగు జాతీయం:
దేశంలో వలస కార్మికులు రేషన్ కార్డుల కోసం ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకొని రోజులు గడుస్తున్న వెరిఫికేషన్ ప్రక్రియను ఆలస్యం చేస్తున్న రాష్ట్రాలపై సుప్రీంకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. ఇది చాలా దురదృష్టకరమని వ్యాఖ్యానించింది. ఈ ప్రక్రియను నాలుగు వారాల్లోగా పూర్తి చేయాలని రాష్ట్రాలను సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. జాతీయ ఆహార భద్రత చట్టం కింద కోటాతో సంబంధం లేకుండా వలస కార్మికులకు రాష్ట్రాలు రేషన్ అందించాలంటూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. దీనిపై గతంలో విచారణ జరిపిన ధర్మాసనం.. ఈ-శ్రమ్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకున్న దాదాపు 8 కోట్ల వలస కార్మికులకు రేషన్ కార్డులు జారీ చేయాలని అన్ని రాష్ట్రాలు,

మిగతా 2లో



## త్వరలో ఆన్‌లైన్‌లో బీర్, వైన్, లిక్కర్

మిగతా 2లో



## ఒకరిని చంపబోయి మరొకరిని చంపాడు

మిగతా 2లో



## ఈ క్రికెటర్లు దివ్యాంగులను అవమానపరిచారు

మిగతా 3లో



## అరటి ఆకులో తింటే అనారోగ్యం దరిచేరదు

మిగతా 4లో

## ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయండి

- వాళ్లు బిఆర్ఎస్ బీ ఫాంపై గెలిచారు
- స్పీకర్‌కు ఫిర్యాదు చేసిన కేటిఆర్, హరీశ్‌రావు

ముందడుగు హైదరాబాద్:
బిఆర్ఎస్ పార్టీకి చెందిన పదిమంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరారని, వారందరిపై అనర్హత వేటు వేయాలని, పలు నియోజకవర్గాల్లో ప్రోటోకాల్ ఉల్లంఘనలపై కూడా బిఆర్ఎస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు పిటిషన్లు అందజేశారు. బీఆర్ఎస్ బీ ఫాంపై గెలుపొంది పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన పది మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు

మిగతా 2లో



## బ్యాంక్ సర్వర్‌ను హ్యాక్ చేసి కోట్లు కొట్టేశారు

### రూ. 16.71 కోట్లు కాజేసిన సైబర్ నేరగాళ్లు

ముందడుగు జాతీయం:
ఆన్‌లైన్ వేదికగా అవకాశం దొరికినప్పుడల్లా సైబర్ నేరగాళ్లు అమాయకులను దోచుకుంటూనే ఉన్నారు. తాజాగా నోయిడా సెక్టార్ 62లో నైనిటాల్ బ్యాంక్ లిమిటెడ్ బ్రాంచ్ సర్వర్‌ను హ్యాక్ చేసిన సైబర్ నేరగాళ్లు రూ. 16.71 కోట్లు కొట్టేశారు. బ్యాంక్ బ్యాలెన్స్ షీట్‌ను తనిఖీ చేసే క్రమంలో బ్యాంక్ ఐటీ మేనేజర్ సుమిత్ శ్రీవాస్తవ ఈ దోపిడీని ఇటీవల గుర్తించారు. ఆపై దర్యాప్తులో బ్యాంక్ సర్వర్

మిగతా 2లో



ముందడుగు
బుధవారం, 17-7-2024, హైదరాబాద్.

## శంకరన్, శ్రీధరన్‌లా కలెక్టర్లు పనితీరు ఉండాలి

(మొదటిపేజీ తరువాయి)
అభివృద్ధిని సమపాళ్లలలో తీసుకెళ్లాలని దిశానిర్దేశం చేశారు. తెలంగాణ పునర్నిర్మాణంలో విద్యా వ్యవస్థ అత్యంత కీలకమని.. విద్యార్థిపై నెలకు రూ.85వేలు ప్రభుత్వం ఖర్చు పెడుతోందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రుల పర్యవేక్షణపై కలెక్టర్లు బాధ్యత తీసుకోవాలన్నారు. కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో టీచర్లు బదిలీ అయితే.. విద్యార్థులు సొంత కుటుంబ సభ్యుడిలా స్పందిస్తున్నారని... కలెక్టర్లు బదిలీ అయినప్పుడు కూడా ప్రజల నుంచి అలాంటి స్పందన వచ్చేలా పనితీరు చూపాలని సీఎం అన్నారు.

### ధరణి సమస్యలు ఆగస్టు 15లోగా పరిష్కరించాలి

ధరణి సమస్యలపై పెండింగ్ దరఖాస్తులు ఆగస్టు 15 నాటికి పరిష్కరించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. కలెక్టర్ల సదస్సులో ధరణి సమస్యలపై సీఎం ఆరా తీశారు. దరఖాస్తులను తిరస్కరిస్తే వాటికి కారణాలు కూడా తెలపాలన్నారు. ధరణిలో పలు సాంకేతిక సమస్యల పరిష్కారానికి కొత్త ఆప్షన్లు అందుబాటులోకి తెచ్చే అంశం పరిశీలించాలని సీఎం సూచించారు. రాష్ట్రంలో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడేందుకు జియో ట్యాగింగ్ విధానాన్ని పరిశీలించాలని తెలిపారు. ఉప ముఖ్యమంత్రి, మంత్రులు, ఉన్నతాధికారులు సమావేశంలో పాల్గొన్నారు.

## ట్రైనీ ఐఏఎస్ పూజా ఖేడ్కర్ ట్రైనింగ్ నిలుపుదల

### ముస్సోరికి రావాలని ఆదేశాలు జారీ

ముందడుగు జాతీయం:
ట్రైనీ ఐఏఎస్ అధికారిణి పూజా ఖేడ్కర్ పలు వివాదాలకు కేంద్ర బిందువుగా మారిన వ్యవహారంలో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. అడ్డదారుల్లో ఆమె ఐఏఎస్ ఉద్యోగం సంపాదించారంటూ పెద్ద ఎత్తున వస్తోన్న ఆరోపణలతో ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. పూజా ఖేడ్కర్ ట్రైనింగ్‌ను నిలుపుదల చేసి తిరిగి ముస్సోరిలోని లాల్ బహదూర్ శాస్త్రి నేషనల్ అకాడమీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్‌కు రావాలని



ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. అధికార దుర్వినియోగం, యూపీఎస్సీకి తప్పుడు అఫిడవిట్ సమర్పించడం వంటి ఆరోపణలతో పూజా ఖేడ్కర్ వార్తల్లో నిలిచిన విషయం తెలిసిందే. మహారాష్ట్రలోని జిల్లా శిక్షణా కార్యక్రమం నుంచి పూజా ఖేడ్కర్‌ని రిలీవ్ చేస్తున్నట్లు జనరల్ అడ్మినిస్ట్రేషన్ విభాగం ఓ ప్రకటనలో తెలిపింది. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌కి ఆమె సమర్పించిన పలు ధ్రువీకరణ పత్రాలల్లో ఆమె దృష్టి లోపానికి సంబంధించిన అంశంపై దర్యాప్తు జరుగుతోంది. పూజా వ్యవహార శైలిపై ఆరోపణలు రావడంతో పుణె నుంచి వాసింకు బదిలీ చేశాక ఆమెపై తీసుకున్న తొలి పెద్ద చర్య ఇదే కావడం గమనార్హం.

## వలస కార్మికులకు రేషన్ కార్డులు ఇవ్వలేదా

(మొదటిపేజీ తరువాయి)
కేంద్రపాలిత ప్రాంతాలను ఆదేశించింది. అయితే, ఇప్పటివరకు తెలంగాణ, బిహార్ రాష్ట్రాలు మాత్రమే వారికి రేషన్ కార్డుల జారీ కోసం 100శాతం వెరిఫికేషన్ పూర్తి చేశాయి.

పిటిషన్‌పై విచారణ సందర్భంగా ఈ విషయాన్ని సీనియర్ అడ్వొకేట్ ప్రశాంత్ భూషణ్ కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. అంతేగాక, కార్డులు జారీ అయినప్పటికీ కొన్ని రాష్ట్రాలు కార్మికులకు రేషన్ అందజేయడం లేదని తెలిపారు. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం నుంచి అదనపు రేషన్ రావట్లేదని ఆయా రాష్ట్రాలు చెబుతున్నట్లు పేర్కొన్నారు. దీంతో ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. ఇది చాలా దురదృష్టకరమైన విషయం. నాలుగు నెలలైనా వెరిఫికేషన్ ప్రక్రియను ఎందుకు పూర్తిచేయలేదు. ఇప్పుడు మరో రెండు నెలలు గడువు కావాలని అడుగుతున్నారు. దీన్ని మేం ఆమోదించలేం. నాలుగు వారాల్లోగా అన్ని రాష్ట్రాలు వలస కార్మికుల వెరిఫికేషన్‌ను పూర్తి చేయాలి. ఒకవేళ రాష్ట్రాలు విఫలమైతే.. ఆయా కార్యదర్శులకు సమన్లు జారీ చేస్తాం" అని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అనంతరం దీనిపై తదుపరి విచారణను ఆగస్టు 27వ తేదీకి వాయిదా వేసింది.




### త్వరలో ఆన్‌లైన్‌లో
## బీర్, వైన్, లిక్కర్
### స్విగ్గీ, జొమాటోలో లిక్కర్ హోమ్ డెలివరీ

ముందడుగు జాతీయం:
అంతా ఇంటర్నెట్ కాలమైపోయింది.. ఇంట్లో కూర్చొని ఏది కావాలన్నా క్షణాల్లో ఆన్‌లైన్ ద్వారానే తెప్పించుకుంటున్నారు. ఫుడ్ నుంచి గ్రాసరీస్ వరకూ ఆన్‌లైన్‌లోనే క్షణాల్లో వచ్చేస్తోంది. ఇదే ఆసరాగా చేసుకొని పలు ఆన్‌లైన్ సంస్థలు ఆదాయాన్ని పెంపొందించుకునే మార్గాలను అన్వేశిస్తున్నాయి. ఈ క్రమంలో ప్రముఖ ఫుడ్ డెలివరీ సంస్థలు స్విగ్గీ, జొమాటో కీలక నిర్ణయం తీసుకున్నాయి. ఈ మేరకు మద్యం ప్రియులకు కిక్కిచ్చే న్యూస్‌ను చెప్పాయి. స్విగ్గీ, జొమాటో, బిగ్ బాస్కెట్ వంటి యాప్స్ త్వరలో బీర్, వైన్, లిక్కర్ వంటి తక్కువ ఆల్కహాల్ డ్రింక్స్‌ను హోమ్ డెలివరీ చేయనున్నట్లు సంబంధిత వర్గాలు తాజాగా వెల్లడించాయి.

## ఒకరిని చంపబోయి మరొకరిని చంపాడు

### ఆసుపత్రిలో బెడ్ మారడంతో బతికిన క్రిమినల్

ముందడుగు ఢిల్లీ:
ఒక క్రిమినల్ ఆసుపత్రిలో చేరి పేషెంట్‌గా చికిత్స పొందుతున్నాడు. అతడిని చంపడానికి ఒక వ్యక్తి ఆసుపత్రిగా వచ్చాడు. వచ్చిన వ్యక్తి క్రిమినల్‌కు బదులు వేరే వ్యక్తిని చంపి వెళ్లాడు. ఆసుపత్రి సిబ్బంది హత్యకు ముందురోజే ఆ వార్డులో సదరు బెడ్‌పై ఉన్న క్రిమినల్‌ను మరో వార్డులోని మరో బెడ్‌కు తరలించారు. దాంతో బెడ్ నెంబర్ గుర్తుపెట్టుకుని వార్డులోకి ప్రవేశించిన హంతకుడు.. ఆ బెడ్‌పై ఉన్న వేరే పేషెంట్‌ను కాల్చిచంపాడు. దేశ రాజధాని ఢిల్లీలోని జీబీటీ ఆస్పత్రిలో గత రాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ విషయాన్ని పోలీసులు సోమవారం వెల్లడించారు. ఆ ప్రకారం జీటీబీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ నేరస్థుడిని హత్య చేసేందుకు అతని శత్రువు ఒకరు



హంతకుడిని పంపాడు. పేషెంట్ వార్డు, బెడ్ నంబర్ వివరాలు తెలుసుకుని హత్యకు ప్లాన్ చేశాడు. కానీ అంతకుముందు రోజే ఆ నేరస్థుడిని మరోవార్డుకు తరలించడంతో అతడి స్థానంలోకి వచ్చిన మరో పేషెంట్ హత్యకు గురయ్యాడు. సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ కేసు దర్యాప్తు కోసం ఉన్నతాధికారులు పలు బృందాలను ఏర్పాటు చేశారు. హత్యకు గురైన రోగి 32 ఏళ్ల రియాజుద్దీన్‌గా పోలీసులు గుర్తించారు. మరో వ్యక్తిని చంపేందుకు వచ్చి మావాడిని చంపేశారని రియాజుద్దీన్ కుటుంబసభ్యులు కూడా బోరున విలపించారు.

## ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయండి

(మొదటిపేజీ తరువాయి)
వేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు స్పీకర్ ప్రసాద్ కుమార్‌ను కోరారు. అదే విధంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు గెలిచిన నియోజకవర్గాల్లో అధికారులు ప్రోటోకాల్ ఉల్లంఘనలకు పాల్పడుతున్నట్లు స్పీకర్ దృష్టికి తీసుకొచ్చారు. ఆయా నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసి ఓడిపోయిన వారికి ప్రాధాన్యత ఇస్తూ, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను నిర్లక్ష్యం చేస్తున్నారని తెలిపారు. వీటిన్నింటిపై దృష్టి సారించి, పరిష్కరించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కోరారు. స్పీకర్‌ను కలిసిన వారిలో ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, కేటీఆర్, సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, పద్మారావు గౌడ్, వేముల ప్రశాంత్ రెడ్డి, మాధవరం కృష్ణారావు, రాజశేఖర్ రెడ్డి, కాలేరు వెంకటేశ్, ముఠా గోపాల్, మాగంటి గోపీనాథ్, డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, కేపీ వివేకానంద గౌడ్ ఉన్నారు.

## బ్యాంక్ సర్వర్‌ను హ్యాక్ చేసి కోట్లు కొట్టేశారు

(మొదటిపేజీ తరువాయి)
హ్యాక్ అయిందని వెల్లడైంది. జూన్ 17 నుంచి జూన్ 21 మధ్య ఈ డబ్బును 84 వేర్వేరు ఖాతాలకు ట్రాన్స్‌ఫర్ అయినట్టుగా గుర్తించారు. దోపిడీని గుర్తించిన వెంటనే శ్రీవాస్తవ నోయిడా సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో జులై 10న ఫిర్యాదు చేశారు. ఈ దోపిడీపై తదుపరి దర్యాప్తు విషయంలో బ్యాంక్ ఇండియన్ కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీం సాయాన్ని కూడా కోరింది. ఎన్సీఆర్‌బీ పోర్టల్‌లో ఇప్పటికే ఫిర్యాదు నమోదవగా, ఎఫ్ఐఆర్ మాత్రం జులై 10న నమోదైందని ఎస్‌హెచ్‌ఓ ఉమేష్ చంద్ర నైతాని వెల్లడించారు. సైబర్ నేరగాళ్లు బ్యాంక్ మేనేజర్ లాగిన్ ఐడీ, పాస్‌వర్డ్‌లను దొంగిలించి చోరీ చేసిన నిధులను 89 వేర్వేరు బ్యాంక్ ఖాతాలకు బదలాయించారని సైబర్ నోయిడా ఏసీపీ వివేక్ రంజన్ రాయ్ వివరించారు.

ముందడుగు
బుధవారం, 17-7-2024, హైదరాబాద్.

# నా బిడ్డ ఆశలన్నీ ఆవిరయ్యాయి..

- ఉగ్రదాడిలో మరణించిన 21ఏళ్ల బ్రిజేష్ తల్లి ఆవేదన
- జమ్ముకశ్మీర్‌లోని డోడా ప్రాంతంలో ఘటన

ముందడుగు జాతీయం: దేశంకోసం పనిచేస్తానని వెళ్లిన నా బిడ్డ ఆశలన్నీ ఆవిరయ్యాయి.. నన్ను ఇంక నోరారా అమ్మ అని పిలిచే గొంతు మూగబోయింది. తన బిడ్డ దేశం కోసం ప్రాణాలు త్యాగం చేశాడన్న ఆత్మ సంతృప్తి. జమ్ముకశ్మీర్‌లోని డోడా ప్రాంతంలో సోమవారం జరిగిన ఉగ్రదాడిలో అమరుడైన కెప్టెన్ బ్రిజేశ్ థపా తల్లి ఆవేదన.. అక్కడి వారి కళ్లల్లో నీళ్లు సుడులు తిరిగేలా చేస్తోంది.

తన బిడ్డను పొట్టన పెట్టుకొని.. ఇంత క్షోభకు గురిచేసిన ఉగ్రవాదులపై ఎలాగైనా ప్రతీకారం తీర్చుకోవాలంటూ విలపిస్తున్న తీరు.. ఆమె దేశభక్తిని చాటి చెబుతోంది. ముష్కరుల దాడిలో 27 ఏళ్ల బ్రిజేశ్ ప్రాణాలు కోల్పోవడంతో అతడి స్వగ్రామం పశ్చిమబెంగాల్‌లోని సిలిగుడిలో



విషాద ఛాయలు అలముకున్నాయి. ఆయన జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరు మున్నీరవుతున్నారు. ఎలాగైనా ఉగ్రవాదులపై ప్రతీకారం తీర్చుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

### పెళ్లి ముచ్చట తీరకుండానే..

బ్రిజేశ్ ఐదేళ్ల క్రితమే సర్వీసులో చేరారు. ఆయనకు ఇంకా వివాహం కాలేదు. తల్లిదండ్రులు, బంధువులు ఈ మధ్యనే ప్రయత్నాలు మొదలు పెట్టారు. సరైన సంబంధం కోసం వెతుకుతున్నారు. ఇంతలోనే ఈ ఘోరం చోటు చేసుకోవడంతో తల్లిదండ్రుల్ని ఓదార్చడం ఎవరివల్లా కావడం లేదు. కుటుంబంలో బ్రిజేశ్ లేని లోటు ఎవరూ తీర్చలేరని, భగవంతుడు వారికి పుత్రశోకాన్ని మిగిల్చాడని బంధువులు వాపోతున్నారు.

# ఈ క్రికెటర్లు దివ్యాంగులను అవమానపరిచారు

## ముగ్గురు మాజీ ఆటగాళ్లపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

ముందడుగు జాతీయం: మన దేశానికి చెందిన ముగ్గురు మాజీ క్రికెటర్లు హర్భజన్ సింగ్, యువరాజ్, సురేశ్ రైనా బాలీవుడ్ పాట 'తౌబా తౌబా'ను తమ స్టైల్‌లో రీక్రియెట్ చేసి చిక్కుల్లో పడ్డారు. ఈ వీడియో ద్వారా దివ్యాంగులను అవమానపరిచారంటూ పలు వర్గాల నుంచి ఆగ్రహం వ్యక్తమవుతోంది. తాజాగా ఈ ముగ్గురు మాజీ ఆటగాళ్లపై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు నమోదైంది.

అసలేం జరిగిందంటే.. తాజాగా 'వరల్డ్ ఛాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్ 2024' టైటిల్ నెగ్గిన జోష్‌లో ఉన్న యువరాజ్ సింగ్, హర్భజన్ సింగ్, సురేశ్ రైనా 'తౌబా తౌబా' పాటకు రీల్ చేశారు. అందులో వారు నడుము పట్టుకుని, కుంటుకుంటూ నడుస్తూ కన్పించారు. ఈ వీడియోను వీరు సోషల్ మీడియాలో షేర్ చేస్తూ.. "15 రోజుల లెజెండ్స్



క్రికెట్ తర్వాత మా శరీరాలు కూడా తౌబా తౌబా అయ్యాయి. శరీరంలో ప్రతి అవయవం నొప్పిగా ఉంది. ఇది మా వెర్షన్ 'తౌబా తౌబా' డ్యాన్స్" అంటూ రాసుకొచ్చారు. దీనిపై దివ్యాంగుల హక్కుల కార్యకర్తలు మండిపడ్డారు. ఇది దివ్యాంగుల మనోభావాలను దెబ్బతీయడమేనని విమర్శించారు.

దీనిపై నేషనల్ కౌన్సిల్ ఫర్ ప్రమోషన్ అండ్ ఎంప్లాయ్‌మెంట్ ఫర్ డిజేబుల్డ్ పీపుల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అర్మన్ అలీ ఢిల్లీలోని అమర్ కాలనీ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దేశంలోని పది కోట్లకుపైగా ఉన్న దివ్యాంగులను అవమానపరిచారని అందులో పేర్కొన్నారు. అలాంటి కంటెంట్‌ను అనుమతించినందుకు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌పై , వీడియో చేసినందుకు క్రికెటర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ వ్యవహారంపై ప్రస్తుతం రాజ్యసభ ఎంపీ అయిన హర్భజన్ సింగ్ స్పందించాడు. వెంటనే ఆ వీడియోను డిలీట్ చేసి క్షమాపణలు చెప్పాడు. ఉద్దేశపూర్వకంగా చేసింది కాదని వివరణ ఇచ్చాడు.

# సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి




ముందడుగు వెంకటాపూర్ సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ రిషిత అన్నారు. మండల కేంద్రంలోని మైనారిటీ జూనియర్ కళాశాలలో మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రిషిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కళాశాలలోని విద్యార్థినులకు వైద్య పరీక్షలను నిర్వహించి, అవసరమైన వారికి రక్త పరీక్షలను చేసి మందులను అందజేశారు. అనంతరం హాస్టల్లోని వంట వంటశాల ను,తరగతి గదులు,డార్మెటరీని పరిశీలించారు. తాజా కూరగాయలు, నాణ్యమైన వంట సామాగ్రిని కొనుగోలు చేయాలని అన్నారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించడం వలన తరచు జబ్బుల బారిన పడకుండా ఉంటారని అన్నారు. రుతు సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. మానసిక ఆందోళనకు గురికా వద్దన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ సదానందం, ఎల్ టి కృష్ణ, ఏఎన్ఎం స్వప్న, ఆశా కార్యకర్తలు మాధవి, సౌజన్య, ఇందిరా తదితరులు పాల్గొన్నారు.

# దొంగిలించిన వస్తువులను తిరిగిఇచ్చిన దొంగ

## క్షమించమని పశ్చాతాప నోటు రాసి పెట్టాడు

ముందడుగు మహారాష్ట్ర: ఒక ఇంటికి తాళం వేయడంతో దొంగ దొంగతనానికి వెళ్లాడు. తీరా దొంగతనం చేశాక ఆ నివాసం ప్రముఖ రచయితదని తెలుసుకుని పశ్చాత్తాపం చెందాడు. దీంతో దొంగలించిన వస్తువులు తిరిగి ఇచ్చేసి, యజమానిని క్షమించమని కోరుతూ నోట్ రాసి పెట్టాడు. ఈ విచిత్రమైన సంఘటన మహారాష్ట్రలోని రాయ్‌గఢ్ జిల్లాలో చోటుచేసుకుంది. ప్రముఖ మరాఠీ కవి, సామాజికవేత్త నారాయణ్ సువే 2010లో కన్నుమూశారు. ప్రస్తుతం ఇంట్లో కుమార్తె సుజాత, ఆమె భర్త గణేష్ ఘారే నివసిస్తున్నారు. వారు విరార్‌లోని కుమారుడి వద్దకు వెళ్లడంతో 10 రోజులు ఇంటికి



తాళం వేసి ఉంది. ఇదే అదునుగా భావించిన ఒక దొంగ ఆ ఇంట్లోకి ప్రవేశించి ఎల్ఈడీ టీవీతో పాటు పలు విలువైన వస్తువులను దొంగలించాడు. మరిన్ని వస్తువుల కోసం మరుసటి రోజు అదే ఇంటికి వచ్చాడు. అప్పుడు ఆ ఇంట్లో నారాయణ్ ఫోటో, జ్ఞాపికలు కనిపించాయి. దీంతో ఆ దొంగ పశ్చాత్తాపం చెంది ముందు దొంగలించిన వస్తువులని తిరిగి ఆ ఇంటిలోనే పెట్టేశాడు. గొప్ప సాహితీవేత్త ఇంట్లో దొంగతనం చేసినందుకు క్షమించాలని కోరుతూ యజమానికి నోట్ రాసి గోడకు అతికించాడు.

ముందడుగు
బుధవారం, 17-7-2024, హైదరాబాద్.

# 1,200+నగరాలకు బీమా సదుపాయాలను విస్తరించిన పీబీ పార్ట్‌నర్స్

pbpartners.com #EK RISHTA BHAROSE KA

ముందడుగు హైదరాబాద్: పాలసీబజార్ పీఓఎస్‌పీ విభాగం పీబీ పార్ట్‌నర్స్, గత 3 ఏళ్లుగా అంకితమైన ఆఫ్‌లైన్ సేవలతో ఏజెంట్ భాగస్వాములు మరియు వినియోగదారుల జీవితాలపై తన ప్రభావాన్ని ప్రతిబింబిస్తూ, 3వ వార్షికోత్సవాన్ని సగర్వంగా ఆచరించుకుంటోంది. పీబీ పార్ట్‌నర్స్ గత 3 ఏళ్లలో గణనీయ మైలురాళ్లను నెలకొల్పింది. తన 1.2 లక్షల మంది సర్టిఫైడ్ భాగస్వాములతో బలమైన నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసుకుని, 18,000+ పిన్ కోడ్‌లకు సేవలు అందిస్తూ, దేశవ్యాప్తంగా 1,200+ నగరాల్లో పని చేస్తోంది. పీబీ పార్ట్‌నర్స్ 16 కన్నా ఎక్కువ నగరాల్లోని అత్యుత్తమ శ్రేణి ఎక్స్‌పీరియన్స్ సెంటర్ల నుంచి పనిచేస్తూ, డిజిటల్ పరిష్కారాలు అందుబాటులో లేని చిన్న నగరాలు, పట్టణాలలో (టైర్ 2 మరియు టైర్ 3) జనాభాకు సమగ్ర బీమా పరిష్కారాలను అందించేందుకు కట్టుబడి ఉంది. ఈ వ్యూహాత్మక విధానానికి 1400+ కన్నా ఎక్కువ రిలేషన్‌షిప్ మేనేజర్‌ల దృఢమైన సేల్స్ ఫోర్స్ మద్దతునిస్తుంది. వీరు మారుమూల, గ్రామీణ ప్రాంతాల్లో తగిన బీమా భద్రతా వలయాన్ని నిర్ధారించేందుకు ఏజెంట్ భాగస్వాములతో కలిసి పని చేస్తారు.

# నిన్న ఎలుక.. నేడు పిల్లి



ముందడుగు

జేఎన్టీయూహెచ్ వర్సిటీలోని మంజీరా హాస్టల్ వంటశాలలో పాత్రలపై ఓ పిల్లి కూర్చొని పెరుగు తాగిన వీడియో సోషల్ మీడియాలో మంగళవారం చక్కర్లు కొట్టింది. ఈ ఘటనను 'ఎక్స్'లో గమనించిన మాజీ మంత్రి కేటీఆర్ స్పందించి 'వర్సిటీ హాస్టల్స్‌లో ఎలుక కోసం పిల్లి వెదుకుతున్నది' అని ట్వీట్ చేశారు. దీంతో ఇన్నాళ్లూ వర్సిటీ హాస్టల్స్ విద్యార్థుల ఫిర్యాదులను పట్టించుకోని జీహెచ్ఎంసీ ఫుడ్‌సేఫ్టీ అధికారులు, హాస్టల్ అధికారులు హడావుడి చేశారు. మంగళవారం సాయంత్రం ఫుడ్‌సేఫ్టీ అధికారులు హాస్టల్స్‌లో పర్యటించి ఆహార నాణ్యత, వంటశాల పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులకు శుచీశుభ్రమైన ఆహారాన్ని అందించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

## చట్నీలో ఎలుకతో చర్చనీయాంశం

ఇటీవల జేఎన్టీయూహెచ్ సుల్తాన్‌పూర్ బ్రాంచ్ హాస్టల్‌లో చట్నీలో ఎలుక పడింది. అందులోంచి తప్పించుకునేందుకు ప్రయత్నిస్తుండగా విద్యార్థులు గమనించి వీడియో తీసి వర్సిటీ హాస్టళ్ల దుస్థితిని బయట ప్రపంచానికి చూపించారు. ఈ ఘటనతో వర్సిటీ హాస్టళ్లలోని శుచీశుభ్రత చర్చనీయాంశమైంది. జేఎన్టీయూహెచ్ హాస్టళ్లలో నాసిరకం ఆహారాన్ని అందిస్తున్నారని, వంటశాలలు పరిశుభ్రంగా లేవని, వంటవారు పరిశుభ్రతను పాటించడం లేదని, ఆహారంలో పురుగులు వస్తున్నాయని విద్యార్థులు పలుమార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేశారు. స్పందన లేకపోవడంతో హాస్టల్ బయట బైఠాయించి నిరసన కూడా తెలిపారు. విద్యార్థుల ఆందోళనలు తీవ్రతరం కావడంతో వర్సిటీ రిజిస్ట్రార్, కళాశాల ప్రిన్సిపాల్, హాస్టల్ అధికారులంతా కలిసి హాస్టళ్లలో పర్యటించి విద్యార్థులను కలిసి సమస్యలు తెలుసుకున్నారు. వంటశాలలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వంటలు చేస్తున్నప్పుడు గ్లౌజ్‌లు ఉపయోగించాలని, పురుగులు పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. కొన్ని రోజులకే వంటశాలలో పాత్రలపై పిల్లి దర్జాగా కూర్చొని పెరుగు తాగిన ఘటనతో కిందిస్థాయి సిబ్బంది అధికారుల ఆదేశాలను ఏమాత్రం పాటించడం లేదని మరోసారి తేటతెల్లమైంది. తమ సమస్యపై వెంటనే స్పందించిన కేటీఆర్‌కు వర్సిటీ విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

## విద్యార్థులు తిన్న తరువాతనే జరిగింది..

ఈ విషయంపై వర్సిటీ మంజీరా హాస్టల్ వార్డెన్ దుర్గాకుమార్‌ను వివరణ కోరగా విద్యార్థులకు భోజనం అందించిన తర్వాతనే వంటశాలలో నిల్వ ఉంచిన ఆహార పదార్థాల గిన్నెపై పిల్లి కూర్చున్నదని చెప్పారు. పెరుగు మాత్రమే తాగడాన్ని గుర్తించి దాన్ని పారబోశామని చెప్పారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# అరటి ఆకులో తింటే అనారోగ్యం దరిచేరదు

- హానికరమైన బ్యాక్టీరియాను నాశనం
- అరటి ఆకుల్లో భోజనం అద్భుత ప్రయోజనాలు



ముందడుగు ప్రత్యేకం: అరటి ఆకులో ఆహారం తినడం వల్ల రుచి, వాసన పెరుగుతుంది. అరటి ఆకు వంటకు మనకు తెలియని సూక్ష్మమైన రుచిని ఇస్తుంది. ముఖ్యంగా అరటి ఆకులలో కొన్ని యాంటీఆక్సిడెంట్ ప్రయోజనాలను నిండివున్నాయి. సహజ యాంటీమైక్రోబయల్ లక్షణాలు ఉన్నాయి. ఇవి ఆహారంలో ఉండే హానికరమైన బ్యాక్టీరియాను నాశనం చేస్తాయి. అరటి ఆకులో తినే ఆహారం అనేక అనారోగ్యాలను దరి చేరకుండా చేస్తుంది. అరటి ఆకుల్లో భోజనం చేయటం వల్ల కలిగే లాభాలేంటో ఇక్కడ తెలుసుకుందాం...

## తెల్ల జుట్టు సమస్య దూరం

అరటి ఆకులలో పాలీఫెనాల్స్, విటమిన్ ఎ, విటమిన్ సి వంటి అనేక ముఖ్యమైన పోషకాలు ఉంటాయి. అరటి ఆకుపై ఆహారాన్ని ఉంచినప్పుడు, ఈ పోషకాలలో కొన్ని ఆహారంలోకి బదిలీ అవుతాయి. దాని పోషక విలువను మెరుగుపరుస్తాయి. అరటి ఆకులు పర్యావరణానికి ఎలాంటి హాని కలిగించకుండా సులభంగా భూమిలో కలిసిపోతాయి. అంతేకాదు.. మిగిలిపోయిన ఆహారాన్ని అరటి ఆకులో చుట్టి నిల్వచేయటం వల్ల పాడవకుండా ఉంటుంది.. అంతేకాదు.. అరటి ఆకులో తినడం జుట్టుకు కూడా మేలు చేస్తుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.. అరటి ఆకుల్లో తరచూ భోజనం చేసేవారిలో తెల్ల జుట్టు సమస్య దూరంగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.

## వేడి, వాపు నుండి ఉపశమనం

అరటి ఆకుల్లో బోజనం చేయడం వల్ల జీర్ణశక్తి మెరుగుపడుతుంది. అలాగే అరటి ఆకుల్లో యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలు అధకంగా ఉంటాయి. వీటిపై భోజనం చేస్తే ఎలాంటి క్రిములు ఆహారం ద్వారా మన శరీరంలోకి చేరవు. అందువల్లే అరటి ఆకులో భోజనం చేయడమే మేలని పెద్దలు చెబుతారు. అరటి ఆకు కాలిన గాయాల చికిత్సలో కూడా ఉపయోగపడుతుంది. అరటి ఆకుపై అల్లం నూనెను చిలకరించి, శరీరం కాలిన భాగంలో పై నుండి క్రిందికి చుట్టండి. ఇది వేడి, వాపు నుండి ఉపశమనం కలిగిస్తుంది. ఎందుకంటే అరటి ఆకుల్లో ఎపిగాల్లోకాటెచిన్ గాలెట్, ఇజిసిజి వంటి పాలీఫెనాల్స్ పుష్కలంగా ఉంటాయి.

## మొటిమలు, మచ్చలు దూరం

అరటి ఆకులను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల రక్తం కూడా శుద్ధి అవుతుంది. అలాగే రాత్రిపూట అంధత్వం వంటి వ్యాధుల నుంచి బయటపడవచ్చు. అరటి ఆకుల్లో ఆహారం తీసుకోవడం వల్ల చర్మానికి కూడా మేలు చేస్తుంది. సాధారణంగా చర్మంపై అల్సర్లు, మొటిమలు, మచ్చలు కనిపించవచ్చు. అలాంటప్పుడు అరటి ఆకుపై కొబ్బరి నూనె రాయండి. దీన్ని చర్మానికి అప్లై చేయడం వల్ల ఇలాంటి సమస్యల నుంచి త్వరగా ఉపశమనం లభిస్తుంది.

ముందడుగు
బుధవారం,
17-7-2024,
హైదరాబాద్.

# ప్రభాస్ లక్కీచార్మ్ కమల్ హాసన్..



ప్రభాస్ హీరోగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం కల్కి 2898 ఏడీ ఎంతటి భారీ విజయాన్ని సాధించిందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ప్రభాస్ కల్కి సినిమాలో కమల్ హాసన్ సుప్రీమ్ యాస్కిన్ పాత్రలో నటించాడు. ఆ సినిమా బ్లాక్ బస్టర్ విజయం అందుకుంది. ఈ చిత్రంలో కమల్ హాసన్ పాత్ర పూర్తి నిడివిలో లేకపోయినా కథలో చాలా కీలకమైన పాత్ర కావటంతో అందరిని ఆకర్షించింది. కల్కి 2898ఏడీ విడుదలైన రెండు వారాలకే కమల్ హాసన్ కథానాయకుడిగా నటించిన భారతీయుడు-2 రిలీజ్ అయ్యింది. ఈ సినిమా అనుకున్నంత విజయం సాధించలేక పోయింది. శంకర్ దర్శకత్వంలో రూపొందించిన` భారతీయుడు` చిత్రానికి సీక్వెల్ గా విడుదలైన ఈ సినిమా ఎన్నో అంచనాలతో ఎదురు చూస్తున్న ప్రేక్షకులను నిరాశకు గురి చేసింది. ఈ సినిమా మొదటి భాగమైన భారతీయుడు కి భారతీయుడు -2 కు చాలా వ్యత్యాసం ఉంది.ఈ చిత్రం కమల్ హాసన్ కెరీర్ లో మరో డిజాస్టర్ గా ....నమోదైంది. అయితే భారతీయుడు-2 డిజాస్టర్ అవ్వడం కల్కి కి మళ్లీ కలిసొచ్చిందనే చెప్పకోవాలి. కల్కి సినిమాకు కలెక్షన్లు తగ్గుతున్న సమయంలో భారతీయుడు -2 విడుదలై నెగెటివ్ టాక్ రావడంతో మళ్లీ కల్కీ కలెక్షన్ల ఊపందుకున్నాయి. టిక్కెట్ల రేట్లు కూడా సాధారణమైన ధరలోకి రావడంతో ప్రేక్షకులందరూ మరోసారి కల్కిని చూడడానికి ఆసక్తి చూపారు. ఇక ఇప్పడు కొంత మంది కమల్ హాసన్ కల్కిలో నటించి విజయాన్నిఇస్తే.. మరోసారి తన అపజయం కూడా ప్రభాస్ కు కలిసొచ్చింది అంటున్నారు. సో.. ప్రభాస్ లక్కీచార్మ్ కమల్ హాసన్ అంటూ అందరూ సరదాగా వ్యాఖ్యానిస్తున్నారు.

# నేను కాగితపు పువ్వును కాదు



ముఖేష్ అంబానీ కొడుకు అనంత్ అంబానీ, రాధికల వివాహం రంగరంగవైభవంగా జరిగిన విషయం తెలిసిందే. ప్రపంచవ్యాప్తంగా ఉన్న సెలబ్రిటీలంతా ఈ వేడుకలో పాల్గొన్నారు. భారతీయ చలనచిత్ర పరిశ్రమకు చెందిన స్టార్లలో వివాహ వేడుక పాలపుంతలా మారింది. అతిథులంతా తమ కుటుంబంలో పెళ్లిలా ఎంజాయ్ చేశారు. ఖరీదైన బహుమతులు కూడా అందుకున్నట్టు విశ్వసనీయ సమాచారం.

అయితే.. తాప్సీ మాత్రం ఆ పెళ్లికి వెళ్లలేదు. దీనిపై ఓ విలేకరి అడిగిన ప్రశ్నకు ఆమె స్పందిస్తూ.. 'పెళ్లి అనేది అనుబంధాల కలయిక. బంధువులు, స్నేహితులు, కుటుంబీకులు, ఇరుగు, పొరుగు అందర్నీ ఒకచోటకు చేర్చే గొప్ప వేడుక పెళ్లి. నిజం చెప్పాలంటే టీవీల్లో చూడ్డం తప్ప వాళ్లెవరో కూడా నాకు తెలీదు. తెలీని వారి పెళ్లికి వెళ్లి, ఆర్టిఫీషియల్ ఆనందాన్ని పొందడం నాకు చేతకాదు. నేను కాగితపు పువ్వును కాదు, సువాసన వెదజల్లే జీవం ఉన్న పుష్పం లాంటిదాన్ని.' అంటూ సెటైర్లు విసిరింది తాప్సీ.



# తెలుగులో మరో సినిమాకు ఓకే చెప్పిందా?

జాన్వీకపూర్ తెలుగు సినిమాలపై ప్రత్యేకమైన దృష్టిపెట్టినట్టుంది. తనకు తమిళంలోనూ అవకాశాలు భారీగా వస్తున్నా.. ఆమె మాత్రం తెలుగు సినిమాలనే ఓకే చేస్తున్నది. ఇప్పటికే ఎన్టీఆర్ 'దేవర-1'లో ఆమె కథానాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే. అలాగే రామ్‌చరణ్, బుచ్చిబాబు సాన దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రంలోనూ ఆమె కథానాయికగా ఎంపికైంది. రెండు దాదాపుగా మూడొందలకోట్ల ప్రాజెక్టులే కావడం గమనార్హం. జాన్వీ తెలుగులో నటిస్తే ఇలాంటి భారీ సినిమాల్లోనే నటిస్తుందని అందరూ అనుకుంటున్న నేపథ్యంలో హీరో నాని సినిమాను కూడా ఆమె ఓకే చేసినట్టు ఫిల్మ్ నగర్‌లో బలంగా వినిపిస్తున్నది. 150కోట్ల బడ్జెట్‌తో 'దసరా'ఫేం శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో నాని నటించనున్న సినిమాలో జాన్వీ కథానాయికగా నటించనుందట. ఈ సినిమాకోసం జాన్వీకి భారీ పారితోషికాన్ని ఆఫర్ చేసినట్టు తెలుస్తున్నది.